క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం



సంగం: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా స్థానిక సాయిబాబా మందిరంలోఅశ్వత్థ నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. మందిరం ప్రాంగణంలోని రాగిచెట్టు, వేప చెట్టులను విశేషంగా అలంకరించి కల్యాణాన్ని జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి వ్రతం



ఆత్మకూరు: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని చెరువు సమీపంలో ఉన్న సాయిబాబా మందిరంలో ఆదివారం రాత్రి సత్యసాయి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సాయిబాబాకు మహిళలు సామూహికంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం సాయిబాబాను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలల్లో తనిఖీలు



సోమశిల: మండలంలోని బొమ్మవరం, అగ్రహారం, మంగుపల్లి పాఠశాలలను ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందాయా..లేదాని ఆరాతీశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి నాణ్యతను పరిశీలించారు.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

బిట్రగుంట: బోగోలు, విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు సోమవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెంచులక్ష్మీపురం సబ్‌స్టేషన్‌లో బోగోలు ఫీడర్‌కు సంబంధించి సమస్యలు తలెత్తడంతో సరఫరాలో అంతరాయం నెలకొంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కరెంటు లేకపోవడంతో మోటార్లు పనిచేయక తాగునీటికి అవస్థ పడ్డారు. రాత్రి 7.30గంటల వరకు కూడా ట్రాన్స్‌కో అధికారులు సరఫరాను పునరుద్ధరించకపోవడంతో వినియోగదారులు మండిపడ్డారు. సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్వహణను గాలికొదిలేయడంతో తరచూ సరఫరా స్తంభించిపోతుందని ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పలకలు, పుస్తకాల పంపిణీ



కావలి : డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ, జవహర్ భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ అంగనవాడీ కేంద్రంలోని చిన్నారులకు సోమవారం పలకలు, పుస్తకాలను పంపిణీ చేశారు. గర్భిణులకు ఐరన్ సిరప్‌లు అందజేశారు. డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ మనోహరరెడ్డి,డైరెక్టర్ తాతిరెడ్డి,సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ శారద, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు అడ్డగింత

మర్రిపాడు: మండలంలోని పల్లిపాడు చెరువు నుంచి మట్టి అక్రమ తరలింపును కేతిగుంట సర్పంచ్ నాగేళ్ల హరితేజ సోమవారం అడ్డుకున్నారు. చెరువు నుంచి అనుమతులు లేకుండా రేయింబవళ్లు జేసీబీ సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తుండగా అడ్డుకుని ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందజేశారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

వింజమూరు(ఉదయగిరి): మండలంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు, అప్‌డేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 23,24,25 తేదీల్లో గుండెమడకల, బుక్కాపురం, 26న శంఖవరం, 27న ఊటుకూరుకు సంబంధించి గుండెమడకల సచివాలయంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వింజమూరు 1,2,3 సచివాలయాలకు సంబంధించి 23,24 తేదీల్లో, వింజమూరు 4,5 సచివాలయాలకు సంబంధించి 24,25 తేదీల్లో, చాకలికొండ, కాటేపల్లి సచివాలయాలకు సంబంధించి 27వ తేదీన వింజమూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు తీరాలి..ప్రగతి పట్టాలెక్కాలి

ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన పలు అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వాటిని పూర్తి చేయాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వానికి చెందిన వారే కావలి, ఉదయగిరి, ఆత్మకూరు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రగతిని పట్టాలెక్కించేందుకు చొరవచూపాలని కోరుతున్నారు.

-కావలి/ఉదయగిరి/ ఆత్మకూరు



నిర్మాణంలోని ఉదయగిరి ట్యాంక్‌బండ్

ఉదయగిరి.. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఉదయగిరి నియోజకవర్గంలో అనేక సమస్యలు ఎన్నో ఏళ్ల నుంచి ప్రజలను వెంటాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొన్ని సమస్యలకు పరిష్కారం లభించినా, ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవచూపాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

- దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభించిన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులను పూర్తిచేయడం ద్వారా ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాల్లో 65వేల ఎకరాలు సాగులోకి వస్తాయి.
- వింజమూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం కాగితాల్లోనే ఉంది. దీనిని పూర్తి చేస్తే వింజమూరు పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇందుకు కేవలం రూ.30 కోట్లు ఖర్చు చేస్తే పనులు పూర్తవుతాయి.
- ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణం చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. కేవలం 3.2 కి.మీ. దూరం అటవీ అనుమతులు రాక రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో సుమారు 16 గ్రామాల ప్రజలు ఉదయగిరికి రాకపోకలు సాగించేందుకు అవస్థ పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నోసార్లు ఆందోళనలు చేపట్టిన సమస్య పరిష్కారం కాలేదు.అయినా ఓపిగ్గా పోరాటాలు చేస్తున్నారు.
- చింతలదేవి కామధేను బ్రీడింగ్ సెంటర్ పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. నిధుల లేమి వెంటాడుతోంది. ఇది జాతీయ ప్రాజెక్ట్ అయినా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని నిధులు మంజూరు చేస్తే ఎంతో మంది పాడి రైతులకు మేలు జరుగుతుంది.
- కలిగిరి, జలదంకి మండలాల్లోని గ్రామాలకు తాగునీటిని అందించేందుకు 9వ మైలు వద్ద చేపట్టిన సురక్షిత మంచినీటి పథకం పనులు చాలా కాలంగా ఆగిపోయి ఉన్నాయి. దీనిని పూర్తి చేస్తే అనేక గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుంది.
- వింజమూరు ప్రాంత పేద విద్యార్థులకు ఉపయోగపడే మోడల్ స్కూల్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి.
- ఉదయగిరి నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన వింజమూరు మండల కేంద్రంలో క్రీడాభివృద్ధికి స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- ఉదయగిరి పట్టణ ప్రజలు సేదతీరేందుకు గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన 'ట్యాంక్ బండ్ ' నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీన్ని పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో గళం వినిపించి నిధులు సాధించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఉదయగిరి నుంచి కొండకింద ఉన్న పదహారు పల్లెలకు సంబంధించి ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు ఎంతో కాలంగా ఆగిపోయి ఉన్నాయి. అటవీ అనుమతుల పేరుతో కాలాయాపన జరుగుతోంది. ఈ గ్రామాలకు చెందిన నిత్యం ప్రయాణికులు ఉదయగిరికి రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేందుకు కూడా సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు.

– కాకు వెంకటయ్య, ఉదయగిరి

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలి



వింజమూరులోని తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి. సోమశిల జలాలను పైపులైను ద్వారా తరలించి వింజమూరులోని రెండు చెరువులను నింపితే తాగునీటి సమస్య శాశ్వతంగా తీరుతోంది. ఆ దిశగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవచూపాలి

– శ్రీనివాసరెడ్డి, వింజమూరు

ఉత్తర కాలువను అభివృద్ధి చేయాలి



ఆత్మకూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఉత్తర కాలువ నీరే ఆధారం. ఏఎస్‌పేట మండలంలోని చివరి ఆయకట్టు వరకు ఉత్తర కాలువ ద్వారా సోమశిల జలాలు అందేలా చూడాలి. అప్పుడే వ్యవసాయపరంగా ఆత్మకూరు నియోజకవర్గం ప్రగతి సాధిస్తుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

-కోటంరెడ్డి సుబ్బారెడ్డి, వెన్నవాడ, ఆత్మకూరు మండలం

అభివృద్ధికి కృషి చేయాలి



ఆత్మకూరు నియోజకవర్గం బాగా వెనుకబడిన ప్రాంతం. ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి చేయాలి. ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు రాబట్టాలి.

– సీహెచ్ శివకుమార్, ఆత్మకూరు

సోమశిల జలాశయాన్ని అభివృద్ధి చేయాలి



78 టీఎంసీల పూర్తి సామర్థ్యం మేరకు సోమశిల జలాశయాన్ని అభివృద్ధి చేయాలి. నీటి లభ్యత స్థిరంగా ఉంటే జిల్లా పాడిపంటలతో అభివృద్ధి చెందుతుంది. దీని వల్లన అన్ని రకాల వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. ఉత్తర, దక్షిణ కాలువలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలి.

– దొమ్మరాజు నరేంద్ర రాజు, చిలకలమర్రి, అనంతసాగరం మండలం

హైలెవల్ కెనాల్ పనులు వేగవంతం చేయాలి



సోమశిల హైలెవల్ కెనాల్ పనులను వేగవంతం చేసి మొదటి, రెండు స్టేజీల నిర్మాణాలు పూర్తి చేయాలి. దీని వల్లన ఆత్మకూరుతో పాటు ఉదయగిరి నియోజకవర్గాలకు సాగు, తాగునీరు లభిస్తుంది. ఆ దిశగా నాయకులు కృషి చేయాలి.

– ఒంటేరు సుధీర్‌కుమార్‌రెడ్డి, చేజర్ల

దర్గాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



ఏఎస్‌పేటలోని హజ్రత్ నాయబ్ రసూలు వారి దర్గాకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందకనుగుణంగా ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా గుర్తించాలి. సంగం బ్యారేజ్, సోమశిల జలాశయం, ఏఎస్‌పేట దర్గాను పర్యాటక కారిడార్‌గా గుర్తించి నిధులు మంజూరు చేయాలి. తద్వారా నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుంది.

-షౌకత్ అలీ, అనుమసముద్రంపేట

ఉత్తర కాలువ జలాలను అందించాలి



మండలంలోని చెరువులకు సోమశిల ఉత్తర కాలువ జలాలను అందించడంపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టి సారించి రైతులను అదుకోవాలి. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి.

– మల్లు రియాజ్‌రెడ్డి, కందులవారిపాళెం, కలిగిరి మండలం

ఉపాధి.. అభివృద్ధిపై ఆశలు

కావలి: కావలి నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. రామాయపట్నం పోర్టు, ఫిషింగ్‌హార్బర్, దగదర్తి ఎయిర్ పోర్టు నిర్మాణాలను పూర్తి చేయడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేయడంతో పాటు స్థానికులకు ఉపాధిని కల్పించాలని ఆకాంక్షిస్తున్నారు. ఆ దిశగా ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి చొరవచూపాలని, అసెంబ్లీకి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి నిధులను సాధించాలని ప్రజలు కోరుతున్నారు.

- బోగోలు మండలంలో జువ్వలదిన్నె వద్ద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2021 మార్చి 19న 72 ఎకరాల్లో రూ.288.8 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనులు 90 శాతం పూర్తయ్యాయి. హార్బర్‌కు అనుసంధానంగా 20 ఎకరాల్లో ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఐదెకరాల్లో బోట్ల తయారీ యూనిట్లు, 50 ఎకరాల్లో ఫుడ్ పార్కును ఏపీ మారిటైం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం సంకల్పించింది. తద్వారా మత్స్యకారులకు స్థానికంగా ఉపాధి కల్పించి వలసలను అరికట్టాలని భావించింది. వీటిపై కావలి ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి కల్పించాలని మత్స్యకారులు కోరుతున్నారు.
- కావలి రూరల్ మండలం చెన్నాయపాళెం పెద్దపట్టుపాళెం వద్ద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3,736 కోట్లతో రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. పోర్టుకు అనుబంధంగా కావలి మండలంలోని చెన్నాయపాళెం, సర్వాయపాళెం, తుమ్మలపెంట, మన్నంగిదిన్నె, తదితర పంచాయతీల పరిధిలో సుమారు 6వేల ఎకరాల్లో పారిశ్రామిక హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇవి రెండు ప్రారంభమైతే కావలి నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.
- దగదర్తి మండలం దామవరం వద్ద 1,861.2 ఎకరాల విస్తీర్ణంలో రూ.368 కోట్లతో కార్గో విమానాశ్రయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.
- సంగం బ్యారేజ్ నుంచి బైపాస్ కెనాల్ నిర్మించి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. కావలి పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడం ద్వారా కావలి రూరల్ మండల రైతులకు సాగునీరు, కావలి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుంది.
- కావలిలోని ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులు, కావలి-తమ్మలపెంట రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి, కావలికి మద్దూరుపాడు నుంచి చౌదరిపాళెం వరకు అవుటర్‌రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు రాబట్టాల్సిన అవసరం ఉంది.
- ఇందిరమ్మ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, జగనన్న కాలనీ లేఅవుట్లలోని 20వేల గృహ నిర్మాణాలను పూర్తిచేసి పేదలకు అప్పగించాల్సి ఉంది.
- కావలిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, క్రీడాకారుల కోసం స్టేడియం నిర్మాణానికి చొరవచూపాల్సిన అవసరం ఉంది. కావలి నియోజకవర్గంలోని సమస్యలను అసెంబ్లీ దృష్టికి నిధుల సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డిని ప్రజలు కోరుతున్నారు.

ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించాలి



ఫిషింగ్ హార్బర్‌కు సంబంధించి మిగిలిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలి. ఫిషింగ్ హార్బర్‌కు అనుసంధానంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే నాలాంటి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆ దిశగా ఎమ్మెల్యే చొరవచూపాలి.

-మహేష్, కావలి

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

ఆత్మకూరు: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు శిక్షా సప్తాహ్ దోహదపడుతుందని ఆత్మకూరు డిప్యూటీ ఈఓ కే గోపాల్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలను హెచ్‌ఎం అనంతలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఈఓ గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించి అభినందించారు. విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఈపీ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లురెడ్డి ప్రారంభించారు. జాతీయ విద్యా విధానం-2020 అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు ఎన్‌ఈపీ ఆకారాని ప్రదర్శించారు. ఉపాధ్యాయులు రమణరాజు, మదీనా, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాధవి పాల్గొన్నారు.



సోమశిల: ఎన్‌ఈపీ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

దుత్తలూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. అందులో భాగంగా దుత్తలూరులోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు అభ్యసనా సామగ్రిని రూపొందించి ప్రదర్శించారు.

చెర్లోయడవల్లి పాఠశాలకు సాంబశివ ట్రస్ట్ చేయూత

ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి, పూర్వ విద్యార్థులు అల్లంపాటి రాజేష్‌రెడ్డి మిత్రబృందం సోమవారం చేయూతనందించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పుస్తకాలను వితరణ చేశారు. కంచి పరమేశ్వరరెడ్డి నిత్యం ఆటోల్లో పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు ఆటో చార్జీల నిమిత్తం రూ.50వేలు నగదును ప్రధానోపాధ్యాయునికి అందజేశారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షలకు ముందు అల్పాహారాన్ని అందిస్తానని ప్రకటించారు. అనంతరం పరమేశ్వరరెడ్డిని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సోమవరపు భాస్కర్‌రెడ్డి, చేరెడ్డి నరేంద్రరెడ్డి, మల్లవరపు జయేంద్ర వరప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వేరుశనగ పంట పరిశీలన

అనుమసముద్రంపేట: మండలంలోని పానుగోడు, రాజవోలు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ పంటను ఏఓ రజని సోమవారం పరిశీలించారు. మండలంలోని రైతులు బోర్ల కింద వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ పంట దెబ్బతింది. ఈ విషయాన్ని రైతులు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఏఓ రజని దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలించారు. దెబ్బతిన పంటల వివరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట వీహెచ్‌ఏ విజయమ్మ, ఏఈఓ చిరంజీవి తదితరులు ఉన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ రజని

కుష్టు వ్యాధిపై అవగాహన



చేజర్ల: కుష్టు సర్వేలో భాగంగా మండలంలోని ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు కుష్టు వ్యాధి లక్షణాలపై సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా కుష్టు నివారణ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ కుష్టును ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే కుష్టు లక్షణాలుగా భావించి వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. చిత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్ నవీన్, గురుకులం ప్రిన్సిపల్ శైలజాకుమారి, నరసింహులు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

జలదంకి: మండలంలోని కొత్తపాళెంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయం ఆవరణలో ఉన్న హుండీని పగులగొట్టి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి తీసుకెళ్లి నగదును దోచుకున్నారు. సోమవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన మహిళ హుండీ లేకపోవడం గమనించి గ్రామస్తులకు తెలియజేసింది. దీంతో గ్రామస్తులు జలదంకి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. హుండీలో దాదాపు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు నగదు ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు.

జామాయిల్ తరలించిన టీడీపీ నాయకుడిపై కేసు

ఆత్మకూరు: వివాదాస్పద పొలంలోని జామాయిల్ కర్రను కొట్టి లారీలో తరలించిన టీడీపీ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలంలో చోటు చేసుకుంది. వివరాలు..చేజర్ల మండలం మడపల్లిలో పినాకిని షీప్ ఫారం పేరుతో 260 ఎకరాల భూమి రిజిస్టర్ అయిఉంది. ఆ కంపెనీలో డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న సోమన శ్రీనివాసులు, కలికి రామ్మోహన్‌రెడ్డిల ఆధీనంలో మరో 90ఎకరాల భూమి కంపెనీ భూమి పక్కనే ఉంది. మొత్తం 350 ఎకరాల్లో వంద ఎకరాలు ఖాళీగా ఉండగా, మిగిలిన 250 ఎకరాల్లో జామాయిల్ చెట్లు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కర్ర కొట్టుకు వచ్చింది. గతంలో రెండుసార్లు సోమన శ్రీనివాసులు రెడ్డి, కల్కి రామ్మోహన్‌రెడ్డిలే కొట్టి తరలించారు. అయితే నెల్లూరుకు చెందిన అజయ్ ఘోష్, గౌతమ్ ఘోష్ అనే వ్యక్తులు ఆ పొలం తమకు చెందినదని, తాము పినాకిని షీప్ ఫారంలో డైరెక్టర్లమేనని చెబుతూ పలువురికి జామాయిల్ కొట్టుకునేందుకు అనుమతులు ఇచ్చి అగ్రిమెంట్లు రాసుకుంటున్నారని అవి చెల్లవని సోమన శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అజయ్‌ఘోష్ మాటలు నమ్మి చేజర్లకు చెందిన టీడీపీ నాయకుడు రావి లక్ష్మీనరసారెడ్డి వివాదాస్పద భూమిలో 15 టన్నుల జామాయిల్ కొట్టి లారీలో బద్వేల్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాసులురెడ్డి చేజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి కలప ఉన్న లారీని స్టేషన్‌కు తీసుకొచ్చారు. కాగా ఈ విషయమై టీడీపీ నాయకుడి వాదన మరోలా ఉంది. తాను ఇరు పార్టీలతో మాట్లాడి వారి అనుమతితోనే జామాయిల్ చెట్లు కొట్టానని చెప్పుకొచ్చారు.

ఉదయం బస్సు.. సాయంత్రం ఆటో



ఉదయం ఆర్టీసీ బస్సులో వెళ్తున్న విద్యార్థులు



సాయంత్రం ఆటోలో తిరిగి వెళ్తున్న విద్యార్థులు

- ఒక్క పూటకే పరిమితమైన మంత్రి ఆనం చొరవ
- విద్యార్థులకు తప్పని కష్టాలు

మర్రిపాడు: మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాల, మర్రిపాడు జూనియర్ కళాశాలలకు వెళ్లే చుంచులూరు, పడమటినాయుడుపల్లి పంచాయతీలకు చెందిన విద్యార్థులకు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో సోమవారం ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఉదయం ప్రత్యేక బస్సులో విద్యార్థులు ఎంతో సంతోషంగా మర్రిపాడు కళాశాల, నందవరం మోడల్ పాఠశాలకు చేరుకున్నారు. అయితే సాయంత్రం బస్సు రాకపోవడంతో విద్యార్థులు మళ్లీ ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం బస్సు ఏర్పాటు చేసిన ఆర్టీసీ అధికారులు సాయంత్రం పాఠశాల, కళాశాల వదిలిన సమయాల్లో కూడా నడపాలి కదా అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.